# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 08-01-2025 సంపుటి : 06 సంచిక : 96 పేజీలు : 8 వెల : రూ 3-00


## నేపాల్ లో భారీ భూకంపం..36 మంది మృతి

హైదరాబాద్ : ఇవాళ ఉదయం నేపాల్ లో భారీ భూకంపం సంభవించింది. ఈ భూకంపంలో 36 మంది మరణించారు. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.1గా నమోదైంది. కొన్ని క్షణాల పాటు ప్రకంపనలు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆరుసార్లు భూమి కంపించడంతో ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. భూకంపం వల్ల ఎంత ఆస్తి నష్టం వాటిల్లిందనే విషయంపై స్పష్టత రాలేదు. నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలోని లబుచె ప్రాంతంలో ఈరోజు ఉదయం 6.35 గంటలకు భూమి కంపించింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు.


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787


# ప్రకృతి సాగులో దేశానికే నమూనాగా కుప్పం



రాబోయే ఐదేళ్లలో 100 శాతం ప్రకృతి సేద్యానికి కృషి

త్వరలోనే 100 రూకార్ట్ సబ్జీ కూలర్లు...

పనితీరు పరిశీలించి మరిన్ని తీసుకొస్తాం

ఆహారమే మందులు... వ్యవసాయమే ఫార్మసీ అయ్యే రోజులు వస్తాయి

-ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

కుప్పం ప్రకృతి వ్యవసాయం విజన్-2029ను విడుదల


కుప్పం, జనవరి 7 : జిల్లాలోని కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా స్వర్ణ కుప్పంలో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఐపీ తంబిగాని పల్లి, తంబి గానిపల్లి గ్రామంలో 41.22 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ప్రాసెసింగ్ ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. మదర్ డెయిరీ ఫ్రూట్ విజిటబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.105.10 కోట్ల వ్యవయంతో ఈ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. 4800 మందికి ఉపాధి దిశగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఫ్రూట్ పల్ప్ (మామిడి, టమోటా) తయారీ ద్వారా 50 వేల మంది రైతులకు ప్రయోజనం పొందేలా చర్యలు చేపడుతున్నట్లు మదర్ డైరీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జయ తీర్థ చారి.. సీఎంకు వివరించారు.అలాగే చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఐపీ తంబి గానిపల్లి, తంబి గానిపల్లి గ్రామం వద్ద 40 ఎకరాలలో ఏపీఐఐసీ ద్వారా శ్రీజ ప్రొడ్యూసర్ కంపెనీ (పాల పొడి తయారీ)కి భూమిని కేటాయించారు. దాదాపు రూ.233 కోట్లతో 4000 మందికి ఉపాధి కల్పించే విధంగా ఈ ప్రాజెక్టను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే లక్ష మంది మహిళా రైతుల భాగస్వామ్యంగా ఉన్నారని ముఖ్యమంత్రికి సీఈఓ తిమ్మప్ప, చైర్మన్ శ్రీదేవి వివరించారు. ఒకే రోజు 200 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేసే సామర్థ్యం గల క్యాటిల్ ఫీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.కుప్పం మున్సిపాలిటీలో అర్బన్ ప్రాజెక్టుల నిర్వహణ, అధికారుల అతిథి గృహాల నిర్మాణం కోసం సమీకృత కాంప్లెక్స్‌లో రూ.10 కోట్ల అంచనా వ్యవయంతో కమాండ్ కంట్రోల్ రూమ్ (2 అంతస్తులు) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డీకే పల్లి పార్కుల అభివృద్ధి, సుందరీకరణ, కుప్పం ఏరియా అభివృద్ధిలో రోడ్డు జంక్షన్లు, వీధి దీపాలను ప్రత్యేక గ్రాంట్లతో రూ.60.20 కోట్ల అంచనా వ్యయంతో కుప్పంలో ఏర్పాటు చేశారు. అలాగే రూ. 110.21 కోట్లతో కుప్పం నియోజకవర్గంలోని 451 డ్రైనేజీ వర్కులను, జీఎస్ హెచ్11-ఎస్‌డీపీ నిధుల ద్వారా చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోత్సవం చేశారు.

# నేడు ఆంధ్రప్రదేశ్ లో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన




అమరావతి,భారత ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు విశాఖ పట్నం సిద్ధం అవుతోంది ఇప్పటికే ప్రధాని మోడీ సభా ప్రాంగణాన్ని ఎస్ పి జి, ఆధీనంలోకి తీసుకుంది ఏయు ఇంజనీరింగ్ గ్రౌండ్ కు 2 కిలోమీటర్ల పరిధిలో స్థానిక ప్రజలకు ఆధార్ వెరిఫికేషన్ పూర్తి చేశారు.బయట నుండి వచ్చే వ్యక్తు లపై నిఘా ఉంచనున్నారు పోలీసులు. ఇక, నేడు, సభా పరిసర ప్రాంతాల్లో నో ప్రయివేట్ డ్రోన్ ఫ్లై విధించారు. ఈ నేపథ్యంలో సభా ప్రాంగణంలో 5000 మంది పోలీ సులు చేరుకుంటున్నారు35 మంది ఐపీఎస్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇక, ప్రధాని మోడీ కంటే ముందుగానే విశాఖ చేరుకోనున్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోడీకి స్వాగతం పలికి ఆ తర్వాత రోడ్‌షోలో పాల్గొనున్నారు.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన ఈసీ




న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు 2025 షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ మంగళవారంనాడు ప్రకటించింది. 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న ఒకే విడతలో ఎన్నికలను నిర్వహించనున్నట్టు తెలిపింది. ఫలితాలు ఫిబ్రవరి 8న వెలువడుతాయని పేర్కొంది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ ప్లీనరీ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆ వివరాలను వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుంది. జనవరి 17వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది. 18న నామినేషన్ల పరిశీలన ఉంటుంది, 20వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఫిబ్రవరి 5వ తేదీ బుధవారం పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.ఢిల్లీలో 1.55 కోట్ల ఓటర్లు ఉన్నారని, వీరిలో 83.49 లక్షల పురుష ఓటర్లు, 71.74 లక్షల మహిళా ఓటర్లు ఉన్నారని, ఐదోసారి ఓటింగ్‌లో పాల్గొంటున్న వారు 2.08 లక్షల మంది ఉన్నారని చెప్పారు. 25.89 లక్షల మంది యువ ఓటర్లు (20-29) ఉన్నట్టు తెలిపారు. ఢిల్లీలో13,033 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.నిర్దిష్ట గ్రూపులను టార్గెట్ చేసుకుని ఓటర్ల జాబితాలో వారి పేర్లు తొలగించడం, కొందరి పేర్లు చేర్చడం జరిగిందని కొందరు (రాజకీయ పార్టీలు) చేస్తున్న దుష్ప్రచారాన్ని రాజీవ్ కుమార్ తోసిపుచ్చారు. ఈవీఎంల గురించి సమాధానం ఇచ్చిన తర్వాత కూడా కొందరు ఈవీఎంల అవకతవకలపై మాట్లాడుతున్నారని అన్నారు. ఈవీఎంలలో వైరస్, బగ్ కానీ, చెల్లని ఓట్లు కానీ ఉండవని, రిగ్గింగ్‌కు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇండియాలో 99 కోట్ల రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారని, ఓటింగ్, మహిళా పార్టిసిపేషన్‌లో ఎన్నికల సంఘం కొత్త రికార్డులు సృష్టించిందని, త్వరలో 100 కోట్ల రిజిస్టర్డ్ ఓటర్లతో సరికొత్త రికార్డు నమోదు కానుందని చెప్పారు. మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటడం దేశంలో మహిళా సాధికారతను బలంగా చాటుతోందన్నారు.కాగా, ఢిల్లీ ప్రస్తుత అసెంబ్లీ కాలపరమితి ఫిబ్రవరి 23వ తేదీతో ముగియనుంది. 2020 అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను అప్పట్లో జనవరి 6న ప్రకటించగా, ఫిబ్రవరి 8న పోలింగ్ జరిగింది. ఫిబ్రవరి 11న ఫలితాలు ప్రకటించారు. ఆ ఎన్నికల్లో 70 అసెంబ్లీ స్థానాల్లో ఆప్ 62 స్థానాలు గెలుచుకుని విజయభేరి మోగించింది. బీజేపీ 8 సీట్లు దక్కించుకుంది. 2013, 2015, 2020లో జరిగిన ఎన్నికల్లో ఆప్ విజయం సాధించి వరుసగా నాలుగో సారి ఢిల్లీలో పాగా వేసేందుకు పావులు కదుపుతోంది. ఒక్కసారి ఛాన్స్ ఇవ్వడంటూ అభివృద్ధి మంత్రంతో ఈసారి ఎన్నికల్లో బీజేపీ ప్రజల ముందుకు వెళ్తోంది. కాంగ్రెస్ పార్టీ సైతం బీజేపీ, ఆప్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నందున కాంగ్రెస్ ఒక్కటే ప్రత్యామ్నాయమని, ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేస్తోంది.

# ఏపీపై వరాల జల్లు..నేడు ప్రారంభించనున్న ప్రధాని మోదీ..



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారు. విశాఖలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం బహిరంగ సభ, రోడ్ షో ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు సైతం భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సభా ఏర్పాటుకు సంబంధించి పనులు చకాచకా సాగుతున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత, పలువురు ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు సభా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.."కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించిన తర్వాత తొలిసారిగా విశాఖకు ప్రధాని మోదీ వస్తున్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి అయ్యాయి. భద్రతాపరంగా ఎటువంటి ఇబ్బందులూ రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కొన్ని లక్షల కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. ఇదంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాని ఇస్తున్న బహుమతి. అందుకు ప్రతిఒక్కరూ మోదీకి అభినందలు తెలియజేయాలి. ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ప్రజలందరూ ఆశీర్వదించాలి. రేపు నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని" కోరారు.విశాఖపట్నానికి బుధవారం వస్తున్న ప్రధాని మోదీ ఏకంగా రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. విశాఖపట్నం సమీపం పూడిమడక వద్ద జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ కింద మొదటి గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. అత్యాధునిక ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. 2030 నాటికి శిలాజేతర ఇంధన సామర్థ్యం 500 గిగావాట్ల లక్ష్యాన్ని సాధించడానికి గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.అలాగే ఏపీలో చేపడుతున్న రూ.19,500 కోట్ల విలువైన రైల్వే, రోడ్డు ప్రాజెక్టులకు సంబంధించి కొన్ని పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనుండగా.. మరికొన్నింటిని ప్రారంభిస్తారు. విశాఖ దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి సైతం ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే మరికొన్ని ఇతర ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. మరోవైపు అనకాపల్లి జిల్లా నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్, తిరుపతి జిల్లాలో చెన్నై- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని కృష్ణపట్నం క్రిస్ సిటీకి ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కింద క్రిస్ సిటీని గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.10,500 కోట్ల పెట్టుబడులను ఆకర్షించనున్నారు.

## గ్రీన్ స్కిల్లింగ్‌పై స్వనీతి ఇనిషియేటివ్ తో ఒప్పందం


గ్రీన్ ఎనర్జీ రంగంలో యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

మంత్రి లోకేష్ సమక్షంలో స్వనీతి, ఎపిఎస్ఎస్ డిసి ఎంఓయు

అమరావతి:రాష్ట్రంలో గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధి కోసం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ంఖూాఆఅ) కీలక ఒప్పందం చేసుకుంది. ఉండవల్లి నివాసంలో రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఈ మేరకు ఎంఓయు కుదిరింది. ప్రముఖ సామాజిక సంస్థ అయిన స్వనీతి ఇనిషియేటివ్ రాష్ట్రంలో పౌరసేవలను మెరుగుపర్చి, అట్టడుగువర్గాల అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పన చేస్తుంది. పరిశోధన, డేటా, పబ్లిక్ సర్వీస్ డెలివరీలో అనుభవం కలిగిన స్వనీతి ఇనియేటివ్ సంస్థ సమాజంలో వెనుకబాటుకు గురైన వారి జీవితాల్లో మార్పు కోసం కృషిచేస్తుంది. స్కిల్లింగ్‌కు సంబంధించి స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌కు పూర్తిస్థాయి మద్దతు ఇస్తుంది. కీలకమైన రంగాలు, పరిశ్రమలను గుర్తించి, స్థిరమైన జాబ్ మార్కెట్‌ను ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమంలో స్వనీతి ఇనిషియేటివ్ ట్రస్టీ ఉమా భట్టాచార్య, స్టేట్ కన్సల్టెంట్ శివ ప్రసాద్, అసోసియేట్ తేజ సరియం, పాఠశాల విద్య, స్కిల్ డెవెలప్మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ గణేష్ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు.గ్రీన్ స్కిల్లింగ్ కోసం ఆర్థికేతర సాంకేతిక సహకారం, సేవలను అందించేందుకు స్వనీతి ఇనిషియేటివ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ంఖూాఆఅ) నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది.

# హైకోర్టులో పేర్నినానికి స్వల్ప ఊరట

అమరావతి, జనవరి 7: ఏపీలో సంచలనం సృష్టించిన బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానికి హైకోర్టులో కాస్త ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి పేర్నినాని వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. తదుపరి విచారణను ఈనెల (జనవరి) 20కి ధర్మాసనం వాయిదా వేసింది. అప్పటి వరకు తొందరపాటు చర్యలు వద్దని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రేషన్ బియ్యం అమ్ముకున్న ఘటనలో ఏ6గా పేర్నినాని ఉండగా, ఏ1గా పేర్నినాని సతీమణి జయసుధ ఉన్నారు. గోడౌన్ మొత్తం కూడా జయసుధ పేరుమీద ఉండటంతో మొదటి నుంచి ఈ కేసులో జయసుధ ఉన్నారు. అయితే ఏ6గా పేర్నినాని చేర్చారు పోలీసులు. ఈ విషయం తెలిసిన వెంటనే పేర్నినాని హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. నిన్న ఈ కేసుపై విచారణ జరుగగా.. నేటికి వాయిదా వేసింది హైకోర్టు. ఈరోజు మరోసారి పేర్నినాని పిటిషన్‌పై హైకోర్టులో విచారణకు వచ్చింది. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం.. జనవరి 20 (సోమవారం) వరకు ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.అలాగే ఈ కేసులో కీలకంగా ఉన్న ఏ2 మానస్ తేజ్ , ఏ4, ఏ5 లారీ డ్రైవర్, రైసు మిల్లు యజమానిని ఒక రోజు పోలీస్ కస్టడీ ఇస్తూ మచిలీపట్నం జిల్లా కోర్టు ఆదేశించింది. ఈరోజు ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు వీరు ముగ్గురిని విచారించాలని కోర్టు ఆదేశించింది. దీంతో ం2 మానస్ తేజ్, ం4 మంగారావు, ం5 ఆంజనేయులును పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈరోజు ఉదయం సబ్ జైలు నుంచి నిందితులను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత నిందితులను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు.బందరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో బియ్యం మాయం నిందితులను సీఐ ఏసుబాబు బృందం విచారిస్తోంది. వారి నుంచి కీలక సమాచారం రాబట్టే అవకాశం ఉంది. బియ్యం మాయం ఘటన వెనక ఎవరెవరు ఉన్నారు అని నిందితులను పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. పేర్నినాని ఆదేశాలతోనే చేశామని ఇప్పటి వరకు జరిగిన విచారణలో నిందితులు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో ఎంతమంది ఉన్నారు.



# సంపాదకీయం

బుధవారం 08-01-2025

## ద్రవ్యోల్బణం, బలహీన రూపాయే అంశాలు

కరోనా తర్వాత ప్రపంచమంతా ఎదుర్కొంటున్న అత్యంత ప్రధాన సమస్య ద్రవ్యోల్బణం. భారతదేశం ఆర్థికంగా ముందడుగు వేస్తుందని చెబుతున్నప్పటికీ.. దేశంలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాల్సి అవసరం చాలా ఉంది. ఎందుకంటే, 2024 అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 14-నెలల గరిష్ఠ స్థాయి 6.21%కి చేరుకుంది. ఆహార ద్రవ్యోల్బణం 15-నెలల గరిష్ఠ స్థాయి 10.87%కి చేరుకుంది. 2023లో, గృహస్తుల ద్వారా వచ్చే పొదుపులు 50 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. నగరాల్లో నివశిస్తున్న సగానికి పైగా జనం అప్పులతోనే జీవితాన్ని గడుపుతున్నారుపేదరికం తగ్గిందని చెబుతున్నప్పటికీ.. అప్పుల భారం సామాన్యుణ్ని ఊపిరి తీసుకోనివ్వడం లేదు. ఇలాంటి నేపథ్యంలో.. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాల్సి ఉంది. అది ఎంత త్వరగా జరిగితే.. దేశంతో పాటు రాష్ట్రాలు కూడా బాగుపడే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలోనే.. ఉఆఖ వృద్ధి చెందేలా చేయాలి. 2024 డిసెంబర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉఆఖ వృద్ధి అంచనాలను 7.2% నుండి 6.6%కి తగ్గించింది. రెపో రేటును వరుసగా పదకొండు పర్యాయాలు తగ్గించలేదు. ప్రపంచంలోనే మూడో అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఈ టార్గెట్ సరిపోదన్నది ప్రధానికి తెలియని విషయం కాదు. దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటానికి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ప్రధాన సవాలుగా ఉంది. అయితే 2022-23, 2023-24 మధ్య 13 వేల కోట్ల రూపాయల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గాయని లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు, ఎలన్ మస్క్ లాంటి కుబేరుడు భారత్‌లో పెట్టుబడి పెడతామని చెప్పి, తర్వాత తత్సారం చేయడం ప్రారంభించారు. భారత్ పర్యటనను రద్దు చేసుకోని, చైనా వైపు చూపు తిప్పారు. ఇంకోవైపు, అదానీ, అంబానీల ఆస్తి గ్రాఫ్ కూడా ఇటీవల తగ్గు మొహం పట్టింది. భారత ప్రధాని మోదీ తీరిక లేకుండా విదేశీ పర్యటనలు చేస్తున్నప్పటికీ.. అనుకున్నంతగా విదేశీ పెట్టుబడులను భారత్ ఆకర్షించలేకపోతోంది. అమెరికాలో అధికార పీఠం ఎక్కబోతున్న డొనాల్డ్ ట్రంప్ చూస్తే.. టారిఫ్‌లతో అటాక్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మోడీ బాధ్యత మరింత పెరిగింది. అంతర్జాతీయంగా భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగాలంటే.. రూపాయిని కూడా బలోపేతం చేయాల్సి ఉంది. 2024 డిసెంబర్‌లో.. రూపాయి మూడవ వరుస సెషన్‌లో బలహీనంగా మారింది. యూఎస్ డాలర్‌తో పోలిస్తే 85.27 వద్ద ఆల్ టైమ్ కనిష్ట స్థాయి వద్ద స్థిరపడింది. ఈ నేపథ్యంలో.. మోదీ ముందున్న పెద్ద సవాలు రూపాయిని బలోపేతం చేయడమే! ఇక, దేశంలో పేదరికం తగ్గుతుందని నివేదికలు వస్తున్నప్పటికీ.. నిరుద్యోగం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అందుకే, మోదీ ప్రభుత్వం అర్జెంట్‌గా ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాల్సి ఉంది. గత రెండేళ్లుగా 10% వద్దే చతికిలపడిన యువత నిరుద్యోగం రేటును ఈ ఏడాది అయినా మెరుగుపర్చాల్సి ఉంది. ఎకనామిక్ సర్వే ప్రకారం, దేశంలోని మొత్తం యువతలో సగం మంది కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత కూడా ఉద్యోగాలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. పోస్ట్‌మ్యాన్ ఉద్యోగాలకు కూడా పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ హోల్డర్లు దరకాస్తు చేసుకుంటున్న పరిస్థితి ఉంది. ఒక విధంగా, దేశంలో చాలా మంది చదువుకు సంబంధించిన ఉద్యోగాలు చేయలేకపోతున్నారు. స్వయం ఉపాధిని ఆశ్రయిద్దామనుకున్నా.. కార్పొరేట్ సంస్థలు వచ్చి చిన్నపాటి వ్యాపారాలను కూడా నిర్వీర్యం చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ సమస్యను అధిగమించాలంటే.. ప్రభుత్వం సామాన్యులకు మేలు చేసే విధంగా విధివిధానాలను రూపొందించాల్సి ఉంది. గత నాలుగేళ్లలో పారిశ్రామిక రంగానికి రూ. 5.65 లక్షల కోట్లు రుణమాఫీ చేశారు. దేశంలోని అతిపెద్ద ఉపాధి సంస్థ వ్యవసాయం, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్‌ల నుండి అన్ని రంగాల్లో రుణాల రద్దు విషయంలో అతి తక్కువ శ్రద్ధ కనబరుస్తున్నారు. కాబట్టి, ఈ సంవత్సరమైనా కేంద్రం ఉద్యోగ కల్పన నుండి స్వయం ఉపాధిలో సామాన్యుడికి సహకరించాల్సి ఉంది. ఈ ఏడాది, ఏటా 17 లక్షల మంది భారతీయులకు ఆహార కొరత మోదీ ప్రభుత్వం ముందున్న అత్యంత ముఖ్యమైన సవాలు అందరికీ ఆహారాన్ని అందించడం. ఏటా 17 లక్షల మంది భారతీయులు తగినంత ఆహారం తీసుకోకపోవడం వల్ల వచ్చే వ్యాధులతో మరణిస్తున్నట్లు నివేదికలు ఉన్నాయి. 2013 నుండి భారతదేశం ఉఆఖలో 50% పెరిగినప్పటికీ.. ప్రపంచంలోని పోషకాహార లోపం ఉన్న పిల్లలలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది భారతదేశంలో నివసిస్తున్నారు. వీరిలో మూడేళ్లలోపు పిల్లల్లో సగం మంది తక్కువ బరువుతో ఉన్నారు. భారతదేశంలో పోషకాహార లోపానికి ప్రధాన కారణాలలో ఆర్థిక అసమానత ఒకటి. జనాభాలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఆర్థిక స్థితి కారణంగా, వారి ఆహారంలో తరచుగా నాణ్యత లోపం, పరిమాణంలోనూ తక్కువ ఉంటోంది. ఇలా పోషకాహార లోపం ఉన్న స్త్రీలకు ఆరోగ్యవంతమైన పిల్లలు పుట్టే అవకాశం తక్కువ. అధిక పోషకాహారం తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. భారతదేశంలో జాతీయ స్థూలకాయం రేట్లు 2010లో స్త్రీలకు 14%, పురుషులకు 18%గా ఉంది. కొన్ని పట్టణ ప్రాంతాలలో 40% కంటే ఎక్కువగా ఉంది. ఊబకాయం వల్ల హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్లు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి అనేక నాన్-కమ్యూనికేబుల్ వ్యాధులకు కారణమవుతుంది. మరోవైపు, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులతో.. సమాజానికి దీర్ఘకాలిక నష్టం ఉంది. మంచి ఆహారం తీసుకునే వారితో పోలిస్తే, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులు న్యుమోనియా, క్షయ వంటి అంటు వ్యాధులకు లోనవుతారు. ఇది అధిక మరణాల రేటుకు దారితీస్తుంది. అంతేకాకుండా, పోషకాహార లోపం ఉన్న వ్యక్తులు పనిలో తక్కువ ఉత్పాదకతను కలిగి ఉంటారు. తక్కువ ఉత్పాదకత వారికి తక్కువ వేతనాన్ని అందించడమే కాకుండా వారిని పోషకాహార లోపం అనే విష వలయంలోకి నెడుతుంది. అందరికీ సమాన వేతనాలు ఉండేలా చూసుకోవడం వల్ల అందరూ మంచి ఆహారాన్ని పొందడానికి అవకాశం ఉంటుంది. గత దశాబ్దంలో వాస్తవ వేతనాల వార్షిక వృద్ధి రేటు అఖిల భారత స్థాయిలో సున్నాకి దగ్గరగా ఉంది. గత ఐదు సంవత్సరాలుగా గ్రామీణ వాస్తవ వేతనాలు 0.4% తగ్గాయి. అలాగే, వ్యవసాయ వేతనాలు 0.2% వద్ద నిలిచిపోయాయి. ఐదుగురిలో నలుగురు వ్యక్తులు 2021 నాటికి రూ. 515 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. అయితే, సామాజిక-ఆర్థిక సంక్షేమంలో మెరుగుదల ఉంటే.. పిల్లల పోషకాహారం కూడా మెరుగుపడుతుందని ఆరోగ్య నిపుణులు కూడా భావిస్తున్నారు. కాబట్టి, దేశంలో ప్రజల ఆరోగ్యంతో పాటు దేశ ఆర్థిక స్థితి మెరుగుపడాలన్నా మోదీ ప్రభుత్వం ఈ సవాళ్లను పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇక, దేశంలో అట్టడుగున ఉన్నవారికి గౌరవం కల్పించాలనే డిమాండ్ కూడా ఉంది. ఇందులో భాగంగా.. ముఖ్యంగా, మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధాన్ని సరిగ్గా అమలు చేయాల్సి ఉంది.

## ఆరోగ్య శ్రీ కాదు..అనారోగ్యశ్రీ

విజయవాడ, జనవరి 7ఆంధ్రప్రదేశ్ లో ఆరోగ్యశ్రీ పథకం నిలిచిపోవడంపై ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) చీఫ్ వైఎస్ షర్మిల ఘాటుగా స్పందించారు. పెండింగ్ లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ లో పోస్ట్ చేసిన షర్మిల.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి ప్రభుత్వాన్ని నిందించారు. పలు విమర్శలు చేస్తూనే తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. పేదవాడి ఆరోగ్యానికి భరోసాగా నిలిచే ఆరోగ్య శ్రీ పథకాన్ని వదిలించుకునే ప్రయత్నం జరుగుతోందని వైఎస్ షర్మిల ఆరోపించారు. ఈ పథకం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మానస పుత్రిక అని చెప్పుకొచ్చారు. ఇదంతా పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతోన్న కుట్రనే అని షర్మిల విమర్శించారు. ఆరోగ్యానికి పెద్దపీట అంటూనే కత్తిపీట వేస్తున్నారని, ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ.. వదిలించుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పెండింగ్ లో ఉన్న ఆరోగ్యశ్రీ నిధులు చెల్లించే బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని చెప్పారు. వెంటనే ఆసుపత్రుల యాజమాన్యాలను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెండింగ్ బకాయిలు రూ. 3వేల కోట్లు తక్షణం విడుదల చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. ప్రాణాలు తీసే జబ్బొచ్చినా సంజీవనిలా పనికొచ్చే ఆరోగ్య శ్రీ పథకాన్ని.. కూటమి సర్కార్ అనారోగ్యశ్రీగా మార్చిందని వైఎస్ షర్మిల మండిపడ్డారు. రూ. 3వేల కోట్లు బకాయిలు చెల్లించకుండా, వైద్యసేవలు నిలిచే దాకా చూడటం గమనిస్తుంటే.. ఆరోగ్య శ్రీ పథకానికి మంగళం పాడేట్టుగానే ఉన్నారన్నారు. ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. గత ప్రభుత్వంపెండింగ్ లో పెట్టినవి అయినా సరే.. ఆరోగ్య శ్రీ పథకానికి బకాయిలను చెల్లించే బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని షర్మిల అన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించి, పథకానికి ఏ లోటూ రాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కొన్ని నెలల క్రితం కూడా షర్మిల ఆరోగ్యశ్రీ పథకం అమలుపై మాట్లాడారు. బకాయిల్లో కనీసం కొంత భాగాన్నైనా చెల్లించాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపడతామని ఆమె హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉన్న సేవలను ఎందుకు నిలిపివేస్తున్నారో ప్రజలు వివరించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య ఖర్చులు భరించలేని పేదల సంక్షేమం కోసం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారని గుర్తు చేసిన ఆమె.. అనేక రాష్ట్రాలు సైతం ఆరోగ్యశ్రీని ఆదర్శంగా తీసుకున్నాయని అన్నారు. 2023 సెప్టెంబర్ నుంచి ఆరోగ్యశ్రీ పథకం అమలుకు నిధుల విడుదలను ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు

## ఫార్ములా ఈ కార్ రేస్.. ఏపీలో సోదాలు

అమరావతి జనవారి 7 తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తెలంగాణ హైకోర్టు తీర్పుతో ఏసీబీ అధికారులు ఫార్ములా ఈ రేసు కేసులో దూకుడు పెంచారు. ఫార్ములా-ఈ కేసులో పలుచోట్ల ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి సోదాలు చేపట్టారు. ఈ కేసుతో ఆంధ్రప్రదేశ్‌తోనూ లింక్ ఉందని అధికారులు గుర్తించారు. దీంతో ఏసీబీ అధికారులు ఇవాళ(మంగళవారం) ఏపీకి వెళ్లి సోదాలు నిర్వహించారు. పలు కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి కీలక డాంక్యుమెట్లను స్వాధీనం చేసుకుంటు న్నట్లు తెలుస్తోంది. మచిలీపట్నంలో ఏస్ అర్బన్ డెవలపర్స్ కార్యాలయంలోకి ఏసీబీ అధికారులు ప్రింటర్లు తీసుకువెళ్లారు. పలు డాక్యుమెంట్లను ఏసీబీ బృందం కాపీలు తీసుకుంటు న్నారు. మొత్తం 12 మంది ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ కార్ రేస్‌కు సంబంధించి నిధులు ఏ అకౌంట్ నుంచి వచ్చాయనే అంశంపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. సిబ్బందిని అడిగి పలు వివరాలు సేకరిస్తున్నారు. తెలంగాణ నుంచి వచ్చిన ఏసీబీ ఉన్నతాధికారుల బృందం తనిఖీలు చేస్తోంది. ఇప్పటికే హైదరాబా ద్‌లో ఏసీబీ బృందం ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. చలమశెట్టి సునీల్‌కు చెందిన గ్రీన్కో అనుబంధ సంస్థ అని తెలంగాణ పోలీసు లు చెబుతున్నారు. చలమశెట్టి సునీల్ జన్మస్థలం కృష్ణా జిల్లా మచిలీపట్నం. సునీల్ తల్లి వెంకటలక్ష్మి గతంలో బందర్ మున్సిప ల్ చైర్మన్‌గా పనిచేశారు. తెలంగాణ నుంచి ఉదయాన్నే ఏసీబీ బృందంఅధికారులు వచ్చారు. పైఅధికారుల ఆదేశాల మేరకే తాము సోదాలు చేస్తున్నామని తెలంగాణ ఏసీబీ అధికారులు తెలిపారు.

# కేసులకు భయపడేది లేదు.. తగ్గేదే లేదు

హైదరాబాద్ జనవరి 7, (న్యూస్ పల్స్)బంజారాహిల్స్ లోని కేటీఆర్ నివాసం వద్ద మాజీ మంత్రి పార్టీ సీనియర్ నేత హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి అరెస్టయి జైల్లో పడడానికి ఈ కేసుకి పొంతనలేదు. రేవంత్ రెడ్డి డబ్బుల కట్టలతో కెమెరాల ముందు దొరికి జైలుకు పోయాడు. కేటీఆర్ మాత్రం తెలంగాణ కోసం హైదరాబాద్ బ్రాండ్ ఈమేజి కోసం ఫార్ములా ఈ రేస్ తీసుకువచ్చాడు. రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం కేటీఆర్ అక్రమ కేసుకి పోల్చడం అంటే మోకాలికి బోడి గుండు కి ముడి వేయడమే. ఎన్ని రకాల కేసులు పెట్టిన మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పైన వెనకకిపోము. ఎన్ని కేసులు పెట్టినా నువ్వు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసేదాకా నీ వెంట పడతాం. అక్రమ కేసులతోనూ అరెస్టులతోనూ మమ్మల్ని బలహీనపరచాలని రేవంత్ రెడ్డి కుట్ర చెల్లదు. ఎన్ని రకాల కేసులు పెట్టిన రేవంత్ రెడ్డిని వదిలిపెట్టము. ఈరోజు హైకోర్టులో ఇచ్చిన తీర్పు కేసులో అవినీతి జరిగిందని నిర్ధారించలేదు. కేసులో అవినీతి ఉందని శిక్ష వేసిన తీర్పు కాదు. ప్రభుత్వం అవినీతి జరిగింది అని చెప్పినప్పుడు... విచారణ చేసుకోమని కోర్టు చెప్పింది. గతంలో కూడా కేటీఆర్ గారు విచారణకు సిద్ధమని చెప్పాము. ఒక్క రూపాయి కూడా చేతులు మారినప్పుడు అవినీతి ఎట్లా జరుగుతుంది. కేటీఆర్ అడుగడుగునా రేవంత్ రెడ్డి తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే ఈ కేసు. అటెన్షన్ డైవర్షన్ కోసమే రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారు. రైతుబంధు ఎగగొట్టడం వల్ల ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొంటుంది. అన్ని సర్వే రిపోర్టులు రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా వస్తున్నాయి. అందుకే మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పైన అక్రమ కేసు పెట్టి అటెన్షన్ డైవర్షన్ కోసం రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. భవిష్యత్తులను ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ కోసం కేసులు రేవంత్ రెడ్డి పెడతాడని మాకు తెలుసు. ఎన్నో పోరాటాలతోనే త్యాగాలతోని తెలంగాణ తెచ్చుకున్నామని అన్నారు. తెలంగాణ ప్రజల అభివృద్ధి సంక్షేమమే తెలంగాణ అభివృద్ధిని మా పార్టీకి ముఖ్యం . రేవంత్ రెడ్డి ని కూడా ఫార్ములా ఈ కంపెనీ కలిసిన ఇప్పటిదాకా బయట పెట్టలేదని అన్నారు. రైతు భరోసాను తగ్గించి ప్రజలకు ఇస్తున్నందుకు... వారి నుంచి వచ్చే వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి ఈ కేసు. ఇది కేవలం కక్ష సాధింపు చర్య మాత్రమే. ఎన్ని రకాల కేసులు పెట్టిన ఎన్ని రకాల కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడిన తెలంగాణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాం. అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న మేము ఎప్పుడూ తెలంగాణ ప్రజల పక్షమే. కేటీఆర్ గారి పెట్టిన కేసులు కానీ పార్టీ నేతల పైన పెడుతున్న కేసులను కానీ పార్టీ ఎదుర్కొంటుంది. కేటీఆర్ కడిగిన ముత్యంల బయటకి వస్తారు. ఎలాంటి తప్పు చేయలేదన్న ధైర్యం ఉంది కాబట్టి విచారణకి వెళ్తాం. ఆయన ముఖ్యమంత్రిగా మాకు అధికారుల పైన కోర్టుల పైన విసం ఉన్నది కానీ రేవంత్ రెడ్డి పైన లేదు. కోర్టులో వచ్చిన తీర్పు పైన కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. కానీ హైకోర్టు చెప్పింది కేవలం విచారణ మాత్రమే చేయమని, విచారణ ప్రారంభం కాకముందే తప్పు జరిగిందని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారు. కొంతమంది హైకోర్టు తీర్పును తప్పుడుగా వక్రీకరిస్తున్నారు. కేటీఆర్ పైన పెట్టిన కేసు తూఫెల్ కేసు. అక్రమ అరెస్టులకు మేము భయపడే వాళ్ళం కాదు. సమైక్య రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల పైన చిచ్చరపిడుగుల్లా పోరాడిన చరిత్ర మాది. గతంలో అరెస్టై కేటీఆర్ వరంగల్ జైల్లో ఉన్నారు. గ్రీన్ కోకి రూపాయి లబ్ధి చేయనప్పుడు వారు ఎందుకు మాకు తిరిగి డబ్బులు ఇస్తారు. అదే గ్రీన్కో కంపెనీ ఫార్ములా అయ్యే నిర్వహణలో భారీగా నష్టపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో వారి నుంచి డబ్బులు వచ్చాయనడం అర్థరహితమని అన్నారు.

## సతీసమేతంగా ఆమ్‌ఆద్మీ పార్టీలోకి బీఎస్పీ నేత..




న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడటంతో వివిధ పార్టీల్లో చేరికలు, రాజీనామాలు జోరందుకున్నాయి. తాజాగా ఢిల్లీకి చెందిన బీఎస్పీ నేత మదన్ మోహన్ తన భార్య సుధేశ్వతితో సహా అధికార ఆమ్ ఆద్మీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ సమక్షంలో వారు ఆ పార్టీలో చేరారు. సంజయ్ సింగ్ వారికి స్వయంగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ దంపతులు సంజయ్ సింగ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చారు. కాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. ఫిబ్రవరి 5న ఢిల్లీ అంతటా ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు. మంగళవారం భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ ప్రెస్‌మీట్ పెట్టి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు.

## ఆశారాంకు సుప్రీం మధ్యంతర బెయిల్ మంజూరీ

న్యూఢిల్లీ: ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపుకు.. సుప్రీంకోర్టు ఇవాళ మధ్యంతర బెయిల్ మంజూరీ చేసింది. ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో మార్చి 31వ తేదీ వరకు ఆయనకు బెయిల్ ఇచ్చారు. మెడికల్ గ్రౌండ్స్ మీద 86 ఏళ్ల ఆశారాం బాపుకు బెయిల్ ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను పాస్ చేసింది. ఆశారాం బాపు తరపున సీనియర్ న్యాయవాది దేవదత్త కమాత్ వాదించారు. ఆయనతో పాటు అడ్వకేట్లు రాజేశ్ గులాబ్ ఇనాందార్, శాశ్వత్ ఆనంద్ కూడా ఉన్నారు. ఆశారాం బాపు అసలు పేరు అసుమల్ సిరుమలాని హర్పలని. జోద్‌పూర్‌లోని అతన ఆశ్రమంలో ఓ టీనేజ్ అమ్మాయిని రేప్ చేసిన ఘటనలో అతన్ని అరెస్టు చేశారు. జోద్‌పూర్ కేసులో బెయిల్ దొరికినా.. మరో రేప్ కేసులో అతని పేరు ఉన్న కారణంగా ఇప్పుడే అతను జైలు విడిచి బయటకు రాలేరు. 2013లో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఓ మహిళను కూడా లైంగికంగా వేధించినట్లు ఆశారాంపై ఆరోపణలు ఉన్నాయి. మార్చి 31వ తేదీ వరకు బెయిల్ మంజూరీ చేస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం తెలిపింది. రిలీజైన తర్వాత ఆయన తన ఫాలోవర్లను కలుసుకోరాదు అని కోర్టు చెప్పింది.

## తెలంగాణలో కొనసాగుతోన్న చలి.. రాబోయే ఐదు రోజులు జర జాగ్రత్త..!

హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా చలి తీవ్రత కొనసాగుతోంది. ఉత్తరాది జిల్లాల్లో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. చలి కూడా తీవ్రంగా ఉండటంతో వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు. ఉదయం 10 అయినా కూడా చల్లని గాలులు వీస్తున్నాయి. దీంతో ఇంట్లో నుంచి బయట అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. జనవరి 8 నుంచి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బలమైన చలి గాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ-హైదరాబాద్) అంచనా వేస్తోంది. అప్పటి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండవచ్చని, కానీ ఆ తర్వాత కనిష్ట ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోవచ్చని ఐఎండీ తెలిపింది. ఉత్తర తెలంగాణ



జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల వరకు తగ్గుతాయని, హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో 7-9 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. రాబోయే 5 రోజులు పొగమంచు పరిస్థితులు కొనసాగుతాయని ఐఎండీ పేర్కొంది. ప్రజలు జాగ్రత్తలు పాటించి, చలి తీవ్రత నుంచి రక్షణ పొందాలని సూచించారు. ఈ ఉష్ణోగ్రతలు సంక్రాంతి పండుగ వరకు కొనసాగే అవకాశం ఉందని తెలంగాణ వెదర్ మ్యాన్ పేర్కొన్నారు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు వెచ్చని ప్రదేశాల్లో ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లో 11.6 డిగ్రీల సెల్సియస్ నుంచి 15 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హెచ్‌సీయూ క్యాంపస్‌లో 11.6 డిగ్రీల సెల్సియస్, మౌలాలీలో 11.8, రాజేంద్రనగర్‌లో 12.2, ఆర్‌సీ పురంలో 12.2, అల్వాల్‌లో 13.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే.. కోహిర్(సంగారెడ్డి)లో 9 డిగ్రీలు, తిర్యానీ(ఆసిఫాబాద్) 9.6, సిర్పూర్(ఆసిఫాబాద్) లో 9.7, మొయినాబాద్(రంగారెడ్డి)లో 10.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

## ఈవీఎంల రిగ్గింగ్ జరగలేదని ఈసీ ఎలా చెప్పగలదు..? : సందీప్ దీక్షిత్

న్యూఢిల్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్ ఈవీఎంలపై మరోసారి విమర్శలు చేశారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నదని వ్యాఖ్యానించారు. ఈవీఎంలను రిగ్గింగ్ చేయడం అసాధ్యమని కొద్దిసేపటి క్రితం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. ఈవీఎంల రిగ్గింగ్ అసాధ్యమని ఎన్నికల సంఘం ఎలా చెప్పగలదని ఆయన ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడా ఈవీఎంల రిగ్గింగ్ చోటుచేసుకుందని అన్నారు. ఓట్లు గంపగుత్తగా ఒకే పార్టీకి పడుతున్నా కూడా ఈవీఎంల రిగ్గింగ్ అసాధ్యమని చెప్పడం అమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించారు. తాను ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు సామాన్య ప్రజలు చాలా మంది ఈవీఎంల రిగ్గింగ్ గురించి మాట్లాడారని చెప్పారు. 'మీరెందుకు అనవసరంగా ఓట్లడుగుతున్నారు..? ఓట్లన్నీ గంపగుత్తగా బీజేపీకే పడుతున్నాయిగా. ఈవీఎంలు ఉన్నంత కాలం ఓట్లు బీజేపీకే వెళ్తాయి' అని సామాన్యులు అంటున్నట్లు సందీప్ దీక్షిత్ తెలిపారు. ఈవీఎంలు ఉన్నంత కాలం బీజేపీ తప్ప మరే పార్టీ గెలువదని సామాన్యులు చెబుతున్నట్లు ఆయన వెల్లడించారు.

# విశాఖ రైల్వే జోన్.. ఒడిస్సా అభ్యంతరం

విశాఖపట్టణం, జనవరి 7,ఏపీలో కొత్తగా ఏర్పాటు కానున్న రైల్వే డివిజన్‌లో వాల్తేర్ డివిజన్ భాగం కానుంది. వాల్తేర్ రైల్వే డివిజన్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ నుంచి వేరు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం ఒడిశాపై తీవ్ర ఆర్థిక పరిణామాలకు దారి తీస్తుందని ఒడిశాలో ప్రధాన ప్రతిపక్షమైన బీజేడీ ఆందోళన వ్యక్తం చేసింది.వాల్తేర్ డివిజన్ విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే జోన్‌లో కలిపే అంశంపై బీజేపీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని ఆ పార్టీ ప్రశ్నించింది. రాయగడలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటును బీజేడీ స్వాగతించింది.రాయగడలో కొత్త రైల్వే డివిజన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు.ఈస్ట్ కోస్ట్ రైల్వే నుంచి ఆదాయాన్ని ఆర్జించే భాగమైన వాల్తేరు డివిజన్ ను విడ దీయడం కేవలం ఆంధ్రప్రదేశ్ ను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యమని బీజేడీ నేత బ్రుగు బక్షిపాత్ర ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై వారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈసీవోఆర్ పరిధిలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే డివిజన్లలో వాల్తేరు రైల్వే డివిజన్ ఒకటని పేర్కొన్నారు.డివిజన్ ను విభజించి ఈసీఓఆర్ కు కీలకమైన ఆదాయాన్ని ఆర్జించే భాగాన్ని దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు బదలాయించాలన్న నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ను, ముఖ్యంగా దాని రాజకీయ నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం మాత్రమేనని బక్షిపాత్ర విమర్శించారు.దేశంలోనే అతిపెద్ద సరుకు రవాణా ఆదాయం ఆర్జిస్తున్న కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్ సహా 1,052 కిలోమీటర్లకు పైగా రైలు మార్గాలను కవర్ చేసే వాల్తేరు డివిజన్ ఇకపై కొత్త జోన్‌లో భాగం కానుంది.వాల్తేరు డివిజన్‌లో 300 డీజిల్ లోకోమోటివ్‌లను ఉంచే సామర్థ్యంతో భారతీయ రైల్వేలో అతిపెద్ద డీజిల్ లోకో షెడ్ ఉందని, లోడింగ్ లో 75 మిలియన్ టన్నుల మార్కును దాటిన డివిజన్ గా, 2024 మార్చి 31 నాటికి రూ.10,000 కోట్ల ఆదాయాన్ని దాటిన డివిజన్ గా గుర్తింపు ఉంది.వాల్తేరు జోన్ దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే, సరుకు రవాణా విభాగాల్లో ఒకటిగా నిలిచిందని, రాష్ట్ర రైల్వే మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడానికి ఒడిశా ప్రాంతాలైన జరికెలా, బండముండా, రూర్కెలా, ఝార్సుగుడా, బెల్పహాడ్, కియోంఝర్, మయూర్భంజ్, బాలాసోర్ జిల్లాలను ఈస్ట్ కోస్ట్ రైల్వేలకు బదిలీ చేయాలని బీజేడీ డిమాండ్ చేసింది.ఈ మార్పు ఒడిశా ప్రయోజనాలను కాపాడుతుందని, రాష్ట్ర ఆర్థిక అవకాశాలను మెరుగు పరుస్తుందని బీజేడీ భావిస్తోంది.

రాష్ట్రంలో రైల్వే జోన్లను సమగ్రంగా సమీక్షించాలని డిమాండ్ చేస్తూ, ప్రస్తుతం ఆగ్నేయ రైల్వే పరిధిలో ఉన్న బాలాసోర్, మయూర్భంజ్ మరియు కియోంఝర్ వంటి జిల్లాలను కలిగి ఉన్న ఉత్తర ఒడిశాలో కొత్త డివిజన్ను సృష్టించాలని ఆ పార్టీ ప్రతిపాదించింది.ప్రస్తుతం చక్రధర్పూర్ డివిజన్లో భాగంగా ఉన్న ఝార్సుగూడ మరియు సుందర్గఢ్లను కలుపుతూ కొత్త రూర్కెలా డివిజన్ను ఏర్పాటు చేయాలని పార్టీ ప్రతిపాదించింది. ఈ చర్యలు ఒడిశాలో మెరుగైన పరిపాలనకు, మెరుగైన రైల్వే సేవలకు దోహదం చేస్తాయని బీజేడీ నేతలు తెలిపారు.వాల్తేరు డివిజన్ ఈసీవోఆర్ నుంచి విడిపోయినప్పుడు బీజేపీ ఎంపీలు మౌనం వహించారని మాజీ ఎంపీ ప్రదీప్ మాఝీ విమర్శించారు.ఒడిశాను ప్రభావితం చేసే కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహిస్తోందని ఆరోపించారు.ఒడిశాలోని మల్కన్ గిరి ప్రాంతంపై ప్రతికూల పరిణామాలు ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లోని వివాదాస్పద పోలవరం ప్రాజెక్టుకు రూ.12,000 కోట్లు కేటాయించాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్, బీహార్ లలో రాజకీయ మిత్రపక్షాల ప్రయోజనాలకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న ధోరణిపై బిజెడి అభ్యంతరం చెబుతోంది. 20 మంది లోక్ సభ ఎంపిలతో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి దోహదపడిన ఒడిశాను పక్కన పెట్టడాన్ని బీజేడీ నేతలు తప్పు పడుతున్నారు

# గోదావరి జిల్లాల్లోబరులు సిద్ధం

రాజమండ్రి, జనవరి 7, రాష్ట్రంలో సంక్రాంతి పండగ అంటే ఫస్ట్ గుర్తొచ్చేది కోడి పందేలు. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితం అయిన ఈ పందేల కల్చర్.. ఇప్పుడు చాలా జిల్లాలకు పాకింది. ఒకప్పుడు సరదాగా సాగిన కోడి పందేలు.. ఇప్పుడు మంచి బిజినెస్ అయ్యిందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అందుకే చాలామంది కోళ్లను పెంచడం, వాటిని విక్రయించడం, బరులు నిర్వహించడం ద్వారా కోట్లాది రూపాయలు కూడబెడుతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.నిర్వాహకులు కోళ్ల పందెం కట్టినందుకు కొంత, గెలిచిన వారి నుంచి కొంత వాటా తీసుకుంటారు. అంతేకాకుండా బరుల వద్ద సైకిల్, టూవీలర్ పార్కింగ్ నుంచి మద్యం, ఇతర దుకాణదారుల వరకు పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తారు. దీంతో పందేల పేరుతో సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.అతి తక్కువ రోజుల్లో కోట్లు రూపాయలు కూడబెట్టుకునే అవకాశం ఉండటంతో.. వివిధ జిల్లాల్లో ఈ సంస్కృతి పెరుగుతోంది. పండగ సంప్రదాయం పేరుతో పందేలు నిర్వహిస్తుండటంతో.. ఆపేవారు ఉండరని నిర్వాహకులు భావిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటి నుంచే బరుల ఏర్పాట్లు ప్రారంభించారు. మరోవైపు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి.కోడి పందేలను చూడటానికి, పందేలు కాయడానికి ఏపీలోని ఇతర జిల్లాలతో పాటు.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి సినీ నటులు, బడా వ్యాపారులు వస్తారు. కేవలం పండగ రోజుల్లోనే కోట్ల రూపాయలు చేతులు మారనున్నాయనే టాక్ ఉంది. ఈ ఏడాది.. 12 నుంచి 15 వరకు నాలుగు రోజులు కోడి పందేల నిర్వహించడానికి ఏర్పాట్లు చకాచకా చేస్తున్నారు.పంట పొలాలను చదును చేసి.. చుట్టూ కంచె వేస్తున్నారు. అక్కడే టెంట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల కోసం మట్టి రోడ్లు వేస్తున్నారు. కోడి పందేలకు వచ్చే వారి కోసం ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. బిర్యానీ, భోజన హోటళ్లు, బెల్ట్ షాపులు ఉండేలా చూసుకుంటున్నారు. వీటిని ఏర్పాటు చేసుకోవాలనుకునే వారి నుంచి కూడా నిర్వాహకులు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు .గతంలో ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పందేలు ఉండేవి. ఇప్పుడు ఇతర జిల్లాల్లోనూ పందేల నిర్వహణకు బరులు సిద్ధం చేస్తున్నారు. దీంతో పందెం కోళ్లకు బాగా డిమాండ్ పెరిగింది. కేవలం సంక్రాంతి కోసమే ప్రత్యేకంగా కోడి పుంజులను పెంచేవారు పెరిగారు. ఒక్కో పుంజు ధర రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉందని పెంపకందారులు చెబుతున్నారు.కోడి పందేలపై గతంలో పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకునేవారు. భోగి పండగకు ముందు వరకు కోడి పందేల నిర్వహణకు వీలు లేదని పోలీసులు స్పష్టం చేశారు. కోళ్లకు కత్తులు కట్టేవారిని బైండోవర్లు చేశారు. కానీ.. కొందరు నేతలు, పెద్దల నుంచి ఒత్తిడి రావడంతో.. పోలీసులు సైలెంట్ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ఈసారి ఏపీలో సంక్రాంతి వేరే లెవల్ ఉంటుందనే టాక్ నడుస్తోంది.

# జెండా మోసేదెవరు...

ఒంగోలు, జనవరి 7,బాపట్ల జిల్లాలోని పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన ఎన్ఆర్ఐ యడం బాలాజీ నియోజకవర్గంలో లేకుండా అడ్రస్ లేకుండా పొయ్యారు. ఎన్నకల ఫలితాలు వెలువడగానే ఫ్లైట్ ఎక్కేసిన ఆయన అమెరికాలో సొంత వ్యాపారాలు చూసుకుంటూ పార్టీ వ్యవహారాలను పట్టించుకోవడమే మానేశారంట. దాంతోపర్చూరు నియోజకవర్గంలో వైసిపి జెండా మోసే నాయకుడు కరువయ్యాడు.పర్చూరుకు కొత్త ఇన్జార్జిని నియమించాలనీ వైసిపి అధిష్టానం చూస్తుందట. ఇప్పటికే పార్టీ ఆవిర్భావం నుంచి నలుగురు ఇన్‌ఛార్జులను మార్చిన వైసీపీ ఈ సారి లోకల్ వ్యక్తులనే నియమించాలని చూస్తుందట. మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు గాదె మధుసూదన్ రెడ్డిని నియమించాలన్న ఆలోచనలో వైసీపీ అధ్యక్షుడు జగన్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇటీవల పులివెందులకు వచ్చిన జగన్ ప్రస్తుత ఇన్చార్చ్‌గా ఉన్న యడం బాలాజీకి కొత్త వారికి బాధ్యతలు అప్పగిస్తునట్లు సమాచారం ఇచ్చారట.గాదే మధుసూదన్ రెడ్డి సొంత ఊరు పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లు మండల పరిధిలోకి వస్తుంది .. ఇటు మాజి మంత్రి గాదే వెంకటరెడ్డి పలు సార్లు ఎమ్మెల్యే గా గెలిచిన అనుభవంతో పాటు ఆ కుటుంబానికి నియోజకవర్గంలో సొంత క్యాడర్ కూడా ఉంది.. దాంతో పర్చూరు వైసీపీ బాధ్యతలను గాదే కుటుంబానికి అప్పగించాలని జగన్ ఆలోచిస్తున్నారంట. వైసిపి పార్టీ ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకు పర్చూరు నియోజకవర్గంలో బోణి కొట్టలేదు. వరుస ఓటములతో నియోజకవర్గంలో వైసీసీ బలహీనంగా మారిపోయింది.పర్చూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలో టీడీపీ ఏడు సార్లు విజయం సాధించగా కాంగ్రెస్ నాలుగు సార్లు విజయం సాధించింది. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు నియోజకవర్గంలో టీడీపీ జెండానే ఎగురుతుంది. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో విజయం సాధించేందుకు అభ్యర్థులను మార్చి మార్చి ప్రయోగించినా వైసీపీ విజయం సాధించలేకపోయింది. నియోజకవర్గంలో వరుసగా మూడుసార్లు పోటీ చేసిన వైసీపీ ప్రతిసారి ప్రయోగాలతో కొత్తవారిని బరిలోకి దింపినా విజయం సాధించలేకపోయింది. ఎన్నికల సమయంలో వచ్చిన కొత్త నేతను స్థానిక క్యాడర్ వ్యతిరేకించడంతో పాటు సదరు అభ్యర్థికి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకునేందుకు సమయం సరిపోయేది. అందుకే నియోజకవర్గంలో ఒక్కసారి కూడా వైసీపీ విజయం సాధించలేకపోయిందన్న అభిప్రాయం ఉంది.ప్రధానంగా నియోజకవర్గంలో బలమైన నేతగా ముద్రపడ్డ టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును వైసీపీ ఎదుర్కోలేకపోయింది. 2014 ఎన్నికల నుంచి మొన్నటి ఎన్నికల దాకా హ్యాట్రిక్ విజయాలతో పర్చూరులో తిరుగులేని నేతగా ఎదిగారు ఏలూరి సాంబశివరావు. 2014 ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించిన ఏలూరి సాంబశివరావు ఆ తరువాత సొంత ఇమేజ్ ను పెంచుకుంటూ వచ్చారు. 2019 ఎన్నికల్లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రమంతా ఫ్యాన్ పార్టీ హవా నడిచిన నియోజకవర్గంలో ఏలూరు సాంబశివరావు గెలుపును అడ్డుకోలేకపోయింది. ఆ ఎన్నికల్లో నియోజకవర్గంలో సీనియర్ రాజకీయ నేత దగ్గుబాటి వెంకటేశ్వరరావు పై సాంబశివరావు గెలుపొందారు. 2024 ఎన్నికల్లో మూడోసారి కూటమి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన సాంబశివరావు వైసీపీ అభ్యర్థి ఎన్నారై యడం బాలాజీ పై 24 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు.మెత్తానికి వైసిపి రా?ష్ట్రంలో భారి ఓటమి అనంతరం పార్టీకి రిపేర్లు చేసుకునే పనిలో పడింది. పర్చూరు బాధ్యతాలు గాదే మధుసూధన్‌రెడ్డికి పగ్గాలు అప్పగించాలని.. అప్పుడే పార్టీ కాస్త అయినా గాడిలో పడే అవకాశముందని నియోజకవర్గ వైసీపీ శ్రేణులు. ఎన్నికల ముందు ఎవరో ఒకరు రావడం.. ఓడిపోగానే కనపడకుండా పోతుండటంతో కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంటోంది. ఇప్పటికే పర్చూరు వైసిపి ఇన్చార్జులను నలుగురిని మార్చింది. ఇప్పుడు మళ్లీ మారిస్తే గాదే మధుసూదన్ రెడ్డి అయిదో కృష్ణుడవుతారు. మరి చూడాలి లోకల్ అయిన మధు సూదన్ పర్చూరు బాధ్యతలు చెపడితే నియోజకవర్గంలో ఏ మాత్రం ప్రభావం చూపిస్తారో.

# అన్నదాత సుఖీభవ పంపిణీకి ఏర్పాట్లు

గుంటూరు, జనవరి 7, రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయనుంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో కలిపి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ స్కీమ్ అమలుకు సర్కార్ ప్రయత్నాలు మొదలుపెట్టింది.ఏపీలో కూటమి ప్రభుత్వం...ఎన్నికల హామీల్లో ఒక్కొక్కటి అమలు చేసేందుకు ప్రయత్నిస్తుంది. తాజాగా అన్నదాత సుఖీభవ పథకంపై ప్రభుత్వం అప్డేట్ ఇచ్చింది. కొత్త సంవత్సరంలో రైతులకు శుభవార్త చెప్పింది. రైతుల సంక్షేమానికి సంబంధించిన అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ఇటీవల కేబినెట్ లో చర్చించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేలు ఇస్తుంది. పీఎం కిసాన్ నిధులతో కలిపి రూ.20 వేలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.పీఎం కిసాన్ నిధులు తరహాలో మూడు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలని భావిస్తుంది. ఈ మేరకు కేంద్రం ఒక్కో విడతలో ఎంత మొత్తం నిధులు విడుదల చేస్తుంది, రాష్ట్ర ప్రభుత్వం ఎంత విడుదల చేయాలని విషయాలపై చర్చిస్తుంది. త్వరలోనే అన్నదాత సుఖీభవ విధి విధానాలను ఖరారు చేసి పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అర్హత ఉన్న ప్రతిరైతుకు ఏడాదికి రూ. 20వేలు అందిస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. ఈ మేరకు ఇటీవల బడ్జెట్ లో అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 4,500 కోట్లను కేటాయించారు.అన్నదాత సుఖీభవ నిధులను ఈ ఏడాది మే నెలలో విడుదల చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇటీవల నరసాపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ...అన్నదాత సుఖీభవ పథకంపై కీలక వ్యాఖ్యలు చేశారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు మే నెలలోనే రూ.20 వేలు అందిస్తుందన్నారు.వైసీపీ హయాంలో రైతుభరోసా పేరిట రైతులకు పెట్టుబడి సాయం అందించేవారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట కేంద్రం ఏటా అందించే రూ.6 వేలకు మరో రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 అందించేవారు. ఎన్నికల హామీల్లో ఈ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతామని కూటమి పార్టీలు ప్రకటించాయి. కూటమి ప్రభుత్వం ఈ హామీ అమలుపై దృష్టి సారించింది. మూడు విడతల్లో రూ. 20 వేలు సాయం అందించేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పేరిట పోర్టల్ ప్రారంభించింది. అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్ నిధులు రూ.6 వేలకు మరో 14 వేలు కలిపి రూ.20 వేలు అందించనున్నారు

# టీడీఆర్ లెక్క 150 కోట్లపైనే

తిరుపతి, జనవరి 7, తిరుపతి నగర పాలక సంస్థకు ఏకంగా 150కోట్లు రూపాయలు నష్టం చేకూర్చారని విజిలెన్స్ నివేదికలో తేల్చింది. మాస్టర్ ప్లాన్ రహదారుల కోసం సేకరించిన అస్తులను కమర్షియల్ గా మార్చి వాటి విలువ పెంచి అయిన వారికి ఇష్టానుసారం టీడీఅర్ బాండ్స్ ఇచ్చారని దీంతో నగర పాలక సంస్థ నష్ట పోయిందని నివేదిక తేల్చి చెప్పింది. మాస్టర్ ప్లాన్ రహదారుల పేరుతో భూమన గ్యాంగ్ చేసిన దందా బయటపడిం దని అంటున్నారు. ఈ స్కాంలో భూమన తో పాటు పలువురు వైసీపీ నేతలు, ప్రభుత్వం యంత్రాంగం మెడకు ఈ ఉచ్చు బిగుసుకోవడం ఖాయమంట.వైసీపీ పాలకులు అయిన వారికి ఇష్టానుసారం ప్రభుత్వ ధనాన్ని దోచి పెట్టారు. వివిధ పథకాల పేరుతో తమ వారికి అయాచిత లబ్ధి చేకూర్చారు. దీంతో పాటు తాము లబ్ధిపొందారు..ఈ విధంగా జరిగింది తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం.. మొత్తం మాస్టర్ ప్లాన్ రహదారుల్లో ఏకంగా 104 రహదారుల నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేశారు. 2003 సంవత్సరం చివర్లో హడావుడిగా నిర్మాణం పనులు నెత్తికెత్తుకున్నారు.. ఇందులో బాగంగా 23 రహదారుల నిర్మాణం పూర్తి చేసారు. అయితే వాటి కోసం 1,389 అస్తులను సేకరించారు. వారికి పరిహారం ఇవ్వడానికి నిధులు లేక పోవడంతో టీడీఅర్ బాండ్ల ఇవ్వడం మొదలు పెట్టారు. అక్కడే అసలు మతలబు జరిగింది. . ఆ రహదారులు వేస్తుంది తమ అస్తుల విలువ పెంచుకోవడానికే అని అప్పట్లో విమర్శలు వచ్చాయి.. దానికి తగ్గట్లుగానే వైసీపీ హయాంలో రహదారులు వేసిన ప్రాంతాలలో ఆ పార్టీ కీలక నేతలు అయిన సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డితో పాటు స్థానిక నేతలు, కార్పొరేటర్ల , చివరికి గల్లీ నేతల అస్తులు కూడా ఉన్నాయి. కొత్త రహదారులు వేయడం పుణ్యమాని వాటి ధరలు పెరిగి పోయాయి.ఇక అదే సమయంలో సదరు నాయకులు తమ అస్మదీయులకు న్యాయం చేయాలని భావించారు. అందులో భాగంగా రెసిడెన్షియల్ ఏరియాలను సైతం కమర్షియల్‌గా మార్చి వేశారు.. అందుకు గాను తమ వారితో అప్పటి కప్పుడు రహదారి వేస్తున్న ప్రాంతాలలో కమర్షియల్ షెడ్స్ వేయించడం లాంటి కార్యకలాపాలు చేయించారు. చిన్న పాటి హోటల్స్ పెట్టించారు. వాటిని చూపిస్తూ అ ఏరియా మొత్తం కమర్షియల్ లెక్కలతో రికార్డులు తయారు చేయించారు. ఆ విధంగా వారు చేయడంతో పెద్ద ఎత్తున నగర పాలక సంస్థ కు ఖజానాకు నష్టం వాటిల్లింది. దానికి తోడు రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులతో మార్కెట్ వాల్యు పెంచి అంచనాలు వేయించారు.మాస్టర్ ప్లాన్ రహదారుల కోసం మొత్తం 1,389 అస్తులను సేకరించగా అందులో టీడీఅర్ బాండ్ల జారీకి అర్హమైనవని 1,149గా తేల్చారు. ఎన్నికల లోపే హడావుడిగా 442 బాండ్ల ను జారీ చేశారు. ఇంకా 707 ఆస్తులకు సంబంధించి బాండ్ల ను జారీ చేయాల్సి ఉంది. అప్పట్లోనే వీటి పైన టీడీపీ పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడంతో వాటిపై అప్పటి మున్సిపల్ ప్రధాన కార్యదర్శి అయిన లక్ష్మి విచారణకు అదేశించారు. దాంతో మిగతా స్థలాలకు టీడీఆర్ బాండ్లు జారీ చేయలేక పోయారు. జారీ చేసిన టీడీఆర్ బాండ్ల విలువ 850 కోట్లు కాగా అందులో అనవసరంగా 150 కోట్లు పెంచారని .. వాస్తవ విలువ 700 కోట్లుగా విజిలెన్స్ తేల్చి చెప్పింది.మొత్తం వ్యవహారంలో కీలక పాత్ర పోషించింది మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డేనంట.. భూమనతో పాటు ఆయన కూమారుడు మాజీ డిప్యూటీ మేయర్, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన భూమన అభినయ్‌రెడ్డితో పాటు అప్పట్లో పనిచేసిన నగర పాలక సంస్థ కమిషనర్ హారిత, టౌన్ ప్లానింగ్ , నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారులు దందా మొత్తం నడిపించారని అంటున్నారు. భూమన కరుణాకరరెడ్డి పర్సనల్‌గా తీసుకుని నడిపించినమొత్తం వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరుగుతుండటంతో మరింత మంది పాత్ర బయటపడే అవకాశముందంట. దీనికి సంబంధించి తమ కంటే రిజిష్టేషన్ శాఖ సిబ్బంది ప్రధానంగా ఇరుక్కుపోతారని? తమకేమి నష్టం లేదని తిరుపతి టౌన్ ప్లానింగ్ అధికారులు అంతర్గత సంభాషణల్లో అంటున్నారంట.. మొత్తం మీద మున్సిపల్ శాఖ సైతం దీనిపై అనంతపురం అర్జేడీ విశ్వనాథ్ అధ్వర్యంలో ఎంక్వయిరీ చేయించింది.

# గంజాయిపై ఉక్కుపాదం

విశాఖపట్టణం, జనవరి 7, ఏపీలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారు. గంజాయి తోట కనిపిస్తే కొట్టేయండి లేదా కాల్చేయండి అని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాసాగు చేస్తున్న 8 ఎకరాల గంజాయి తోటల్ని అధికారులు ధ్వంసం చేశారు. అల్లూరి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చుతామని పోలీసులు చెబుతున్నారు. ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నట్లు కనిపించినా, గంజాయి అక్రమ రవాణా గురించి తెలిసినా, డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించినా వెంటనే 1972 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణకు డ్రోన్లు, టెక్నాలజీ వినియోగించాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ క్రమంలో పెదబయలు మండలంలోని కంతుర్లకు చేరుకున్న అధికారులు డ్రోన్ల సాయంతో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. గంజాయి సాగు నివారించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ అమిత్ బర్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులు పాతపాడు గ్రామంలో 8 ఎకరాల్లో సాగవుతున్న గంజాయి (కానబిస్) తోటను ధ్వంసం చేశారు. జిల్లాలో కొన్ని రోజుల కిందట సైతం డ్రోన్ల ద్వారా పలుచోట్ల గంజాయి సాగు గుర్తించిన అధికారులు తోటల్ని ధ్వంసం చేశారు.ఇది అక్రమ సాగు నియంత్రణ కోసం చేపట్టిన ఆపరేషన్. ఈ ఆపరేషన్లో డ్రోన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సేవలు, o1 టూల్స్ ను ఉపయోగించి ఈ గంజా సాగులను గుర్తించి, వాటిని నాశనం చేయడంలో సహకరించాయని రవికృష్ణ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకూ మొత్తం 2,000 ఎకరాలను డ్రోన్ సర్వే బృందం పర్యవేక్షించింది. డ్రోన్ల ద్వారా గంజాయి సాగును గుర్తించి, గంజాయి తోటల్ని నాశనం చేయడం తమ లక్ష్యమన్నారు. అనంతరం వ్యక్తిగతంగా పాతపాడు గ్రామ ప్రజలతో సమావేశమై గంజాయి సాగువల్ల కలిగే దుష్పరిణామాలు వివరించారు. వీటి కేసులలో ఇరుక్కుని జైలుకు వెళితే జీవితం నాశనం అవుతుందని వారికి నష్టాలపై అవగాహన కల్పించారు.గిరిజనులు చేసే గంజా సాగు వల్ల గ్రామంతో పాటు సమాజం భవిష్యత్తుకు ఏర్పడే హానిని ప్రస్తావించారు. గిరిజనులు, గ్రామస్తులు ఇక నుంచి ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనకుండా ప్రతిజ్ఞ చేయించారు. వారికి ప్రత్యామ్నాయ పంటలను అందించడానికి పోలీసులు, రెవెన్యూ, అటవీశాఖలు సాయం చేస్తాయని హామీ ఇచ్చారు. ఈ ఏడాది పాతపాడులో కింగ్ బీన్స్, రాజ్మ, మిల్లెట్ వంటి ప్రత్యామ్నాయ పంటలను అందజేసినట్లు తెలిపారు.అల్లూరి సీతారామరాజు పోలీస్ విభాగం, స్థానిక గ్రామాలతో కలిసి మరింత శాశ్వతమైన, చట్టబద్ధమైన వ్యవసాయ పద్ధతుల వైపు మారేందుకు సహాయం చేస్తామన్నారు. మెరుగైన భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలని వారికి సూచించారు. ఈ ఆపరేషన్ లో భాగంగా ఈగల్ ఐజీ రవి కృష్ణ, ఈగల్ ఎస్పీ నాగేశ్ బాబు, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, డీఎస్పీ ప్రమోద్, డీఈవో బ్రహ్మాజీరావు, ఫారెస్ట్ అధికారులు, జల్లా పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# ముందే ముంగిట్లోకి ముంజులు, మామిడిపండ్లు

విజయవాడ, జనవరి 7, ఏపీలో ఓ ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది.ఎప్పుడో వేసవి కాలం అంటే ఏప్రిల్ , మే నెలలో కనిపించే తాటి ముంజలు, మామిడి పండ్లు.. మూడు నెలలు ముందుగానే దర్శనమిచ్చాయి. విచిత్రంగా డిసెంబర్‌లోనే తాటి ముంజలు, మామిడి పండ్లు అందుబాటులోకి రావడం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. విజయవాడలో తాటి ముంజలు, మామిడి పండ్లను రోడ్లు పక్కన ఉంచి విక్రయిస్తున్నారు. . ఇదంతా చూసి కొందరు ఆశ్చర్యపోతున్నారు. మరికొందరు వీటిని కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్తున్నారు.వాస్తవానికి ఏటా వేసవికాలంలో, ఏప్రిల్ నెలలో తాటిముంజలు సీజన్ ఉంటుంది. జనాలు ఎండ తీవ్రతను నుంచి ఉపశమనం పొందేందుకు కొంటుంటారు. కానీ ఇప్పుడు రోడ్ల పక్కన డిసెంబర్‌లోనే తాటి ముంజలు కనిపిస్తున్నాయి. విజయవాడలోని బందరు రోడ్డులో గంగూరు సమీపంలో తాటిముంజలను డజను రూ.100 నుంచి రూ.120కి విక్రయిస్తున్నారు. జనాలు కూడా తాటి ముంజల్ని కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది మాత్రం డిసెంబర్‌లో తాటి ముంజలు ఏంటని చర్చించుకుంటున్నారు.మరోవైపు విజయవాడలోనే మామడి పండ్లు కూడా రోడ్ల పక్కన కనిపిస్తున్నాయి. నెల్లూరు జిల్లా ఉలవపాడు ప్రాంతంలో తోటల్లోని రెండు వేల చెట్లలో మామిడి పంట దిగుబడికి వచ్చిందట. మొత్తం నాలుగు టన్నుల మామిడి పండ్లను విజయవాడ కృష్ణలంక సమీపంలో రోడ్డుపై వీటిని అమ్ముతున్నారు. వీటిని కిలో రూ.250 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు. జనాలు కూడా మామిడి పండ్లను కొనుగోలు చేస్తున్నారు.

## జర్నలిస్టుల హెల్త్ కార్డ్ రెన్యువల్ చేయండి.

**- మిాసాల రామస్వామి..**



విభారే న్యూస్ కర్నూల్ ప్రతినిధి. జనవరి 7జర్నలిస్టులను వెంబడిస్తున్న అనారోగ్య సమస్యలుకర్నూలు జిల్లా ఎలక్ట్రానిక్ మిాడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల కు హెల్త్ కార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జర్నలిస్టు లు మిాసాల రామస్వామి వారణాసి ప్రసాదు శర్మ లు కోరారు. కర్నూల్ కలెక్టర్ కార్యాలయం డిఆర్ఓ వెంకటనారాయణమ ను కలిసి జర్నలిస్టు లు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని హెల్త్ కార్డ్స్ తక్షణమే రెన్యువల్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మిాసాల రామస్వామి వారణాసి ప్రసాదు శర్మ లు మాట్లాడుతూ నవంబర్ నెల వరకు హెల్త్ కార్డ్స్ రెన్యువల్ కొరకు చలానాలను జర్నలిస్టులు కట్టిన నేటికీ రెన్యువల్ చేయకపోవడం వల్ల జర్నలిస్టులకు వచ్చిన అనారోగ్య సమస్యలతో పరీక్షలు చేయించుకోవడానికి ఆపరేషన్లు చేసుకోవడానికి ఆర్థిక ఇబ్బందులతో సత మాతమవుతున్నారని, ప్రాణం మిాదికి వచ్చిన జర్నలిస్టులు ఆపరేషన్లు చేయించుకున్న వాటికి నిధులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఇండియన్ ఎక్స్ప్రెస్ మేనేజర్ సురేష్, రామచంద్రారెడ్డి, కెమెరామెన్ సురేష్ పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన సేవలు అందించండి--

**ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని--**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 07-గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని మహానంది మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు బుడ్డా రెడ్డి యశస్విని పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం తిమ్మాపురం, గాజులపల్లి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనకి చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఉన్నటువంటి బాలింతకు వైద్య ఖర్చులకై రెండు వేలు తమ వంతుగా సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరెడ్డి, బుక్కాపురం టిడిపి నాయకులు కందుల రాంభూపాల్ రెడ్డి మరియు ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇస్తమా కు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ -

- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 07-నేటి నుండి నంద్యాల జిల్లా ఆత్మకూరు నందు ఇస్తామా జరుగుతున్న సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ పార్కింగ్ ప్రదేశాలు ,కంట్రోల్ రూమ్,సభాస్థలి మొదలగు ముఖ్యమైన ప్రాంతాలను స్వయంగా సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.భద్రత ఏర్పాట్లపై సంబంధిత



అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. అనంతరం బందోబస్తు ఏర్పాట్ల స్వయంగా పరిశీలించారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ , ఇన్స్పెక్టర్లు రాము, సురేష్ కుమార్ రెడ్డి, ఇస్తామా పెద్దలు పాల్గొన్నారు.


## విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలి....





విభారే న్యూస్ జనవరి 07 ఎమ్మిగనూరు..బాధ్యత గల పౌరులుగా లిటిల్ ప్లానెట్ ఇంగ్లీష్ మిాడియం స్కూల్ విద్యార్థులు..డా.మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు..విద్యార్థులు సామాజిక కలిగి ఉండాలని, పట్టణానికి చెందిన లిటిల్ ప్లానెట్ ఇంగ్లీష్ మిాడియం స్కూల్ విద్యార్థులు బాధ్యతగల పౌరులుగా ఉన్నారని సామాజికవేత్త మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెలఫ్రెడ్ రాజు పేర్కొన్నారు. మంగళవారం లిటిల్ ప్లానెట్ స్కూల్ యాజమాన్యం మని మాధురి ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థుల చేత, పట్టణంలోని శ్రీనివాస సర్కిల్, మాచాని సోమప్ప సర్కిల్, వివిధ సర్కిలలో సోషల్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ అనగా మొబైల్స్ ఎక్కువ వాడడం వల్ల నష్టాలు, మొబైల్ ను మితంగా ఏ విధంగా వాడాలి, హెల్మెట్,లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే కలిగే నష్టాలు రాష్ డ్రైవింగ్ చేస్తే కలిగే నష్టాలు,ఆన్లైన్ గేమ్స్ బెట్టింగ్ ద్వారా నష్టాలు, మత్తు పదార్థాలకు బానిసైతే కలిగే నష్టాలు, పౌరుల యొక్క సామాజిక బాధ్యతలు గురించి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాల్ని ఉద్దేశించి డా.మల్లెలఫ్రెడ్ రాజు మాట్లాడుతూ లిటిల్ ప్లానెట్ స్కూల్ యాజమాన్యం మాధురి వారి బృందానికి ఆ స్కూల్ విద్యార్థులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు అభినందనలుతెలియజేశారు. అంతేకాక లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు ఇలాంటి అద్భుతమైన మంచి సోషల్ అవేర్నెస్ కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయం.లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు సమాజంలో మంచి సామాజిక స్పృహ కలిగిన భవిష్యత్ పౌరులని కొనియాడారు. అంతేకాక సమాజంలో యువత అనేక వ్యసనాలకు లోనై, మొబైల్స్ వాడకంలో గాని, హెల్మెట్ లేకుండా లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ యాక్సిడెంట్లు గురవుతూ, సమాజంలో ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కార్యక్రమాలకు బానిసౌతూ,తమ జీవితాలను అనేకమంది పౌరులు నాశనం చేసుకుంటున్న అన్నారు స లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు ప్రజలను మేల్కొల్పే విధంగా ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషం, అలాగే లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు మంచి మానవత్వం గల విద్యార్థులని, ఎందుకంటే గతంలో విజయవాడ ప్రాంతంలో వరదలకు గురై, అనేకమంది ప్రజలు తినడానికి తిండి లేక కట్టుకోవడానికి గుడ్డ లేక రోడ్డున పడ్డ పరిస్థితిలో మల్లెల గ్రూప్స్ పిలుపుమేరకు లక్ష రూపాయలు విలువ గల సహాయాన్ని అందించి మానవత్వం కలిగిన విద్యార్థులుగా నిరూపించుకోవడం జరిగింది. విద్యార్థులను మంచి విద్యావంతులుగా, తీర్చిదిద్దే లిటిల్ ప్లానెట్ స్కూల్ యాజమాన్యానికి మరియు స్కూల్ స్టాఫ్ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో లిటిల్ ప్లానెట్ స్కూల్ యాజమాన్యం వారి బృందము విద్యార్థులు, మొదలగు వారు పాల్గొనడం జరిగింది.

## ప్రజల సౌలభ్యం కోసమే రోండో తాసిల్దార్ కార్యలయం-- మంత్రి ఫరూక్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 07-జనాభా ప్రాతిపదికన మేరకు నంద్యాల అర్బన్ మండల తాసిల్దార్ కార్యాలయాన్ని సత్వర రెవెన్యూ సర్వీసుల సౌలభ్యం కొరకు రెండు భాగాలుగా విభజించి రూరల్ మండల తాసిల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ తాసిల్దార్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటైన రూరల్ మండల తాసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫారుక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణం జిల్లా కేంద్రమైన తర్వాత జనాభా అధికమైన నేపథ్యంలో రూరల్, అర్బన్ మండలాలుగా విభజించి ప్రజలకు రెవెన్యూ సర్వీసులను సరళీతరం చేసేందుకు రూరల్ తాసిల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గతంలో నంద్యాల పట్టణ కేంద్రంలో అనేక మంది మేధావులు, అధికారులు పనిచేసి అభివృద్ధి చేశారన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి అన్ని కార్యాలయాలు ఒకే ప్రదేశానికి తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. రాయలసీమ జిల్లాలలో నంద్యాల జిల్లాకు మంచి పేరు ఉందని ప్రజలు, అధికారులు సహకరించి జిల్లాను అభివృద్ధి చేయాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని భూ సంబంధిత దరఖాస్తులు, ఇతర సర్వీసులకు సంబంధించిన అంశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో నంద్యాల రూరల్ మండల ఏర్పాటుకు నిమిత్తం ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈ మేరకు మంత్రి చేతుల మీదుగా నంద్యాల అర్బన్ తాసిల్దార్ కార్యాలయ భవన ప్రాంగణంలోనే రూరల్ మండల కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు. రూరల్ మండల కార్యాలయ పరిధిలో 13 రెవెన్యూ గ్రామాలు వస్తాయన్నారు. మండల పరిధిలోని సచివాలయాలను కూడా అనుసంధానం చేసి అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర సేవలు అందించేందుకు ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం మండల కార్యాలయ ఆవరణలో మంత్రి, కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హెచ్ ఎం పీవీ వైరస్ కు కోవిడ్ కు సంబంధం లేదు--డాక్టర్ వెంకట రమణ డీఎం హెచ్ వో.

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 07--హెచ్ ఎం పీ వీ వైరస్ కోవిడ్ కు సంబందంలేదని డీ ఎం హెచ్ వో డాక్టర్ వెంకట రమణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇది 2001లో కనుగొనబడిన పాత వైరస్సే.. కోవిడ్ లాగా కొత్తగా వచ్చిన వైరస్ కాదన్నారు .కోవిడ్ లాగా ఎక్కువ మందికి ఇది సంక్రమించే అవకాశం లేదన్నారు . మనము ఎక్కువగా భయపడవలసిన పని లేదు.ఇది ప్రతి సంవత్సరము చలికాలంలో వచ్చే జలుబు లేదా సర్ది లాగే ఉంటుంది. జలుబు తుమ్ములు పొడి దగ్గు వస్తుంది.. ఎన్నో వైరస్ల వల్ల మనకు ప్రతి సంవత్సరము జలుబు వస్తూ ఉంటుంది.. ఏమంటే ఇంతకుముందు మనకు వాటిని పరీక్ష చేసేది తెలియదు.. ఇప్పుడు ఆర్టీపిసీఆర్ ల్యాబ్స్ ఉన్నందువలన వాటిని పరీక్ష చేసి దాని యొక్క పేర్లు పెడుతున్నారు.. మీడియా వలన ఎక్కువగా సమాచారం అందరికీ చేరుతూ ఉంది..ఏ వైరల్ జలుబు అయినా కానీ ముక్కులోనే ఉండకుండా అది కింద గొంతు ఊపిరితిత్తులలోకి వెళ్లి బ్రాంకైటిస్తే నిమోనియా కలగచేయవచ్చు.. అది చిన్న పిల్లల్లో, వృద్ధులు లో మరియు ఇమ్యూనిటీ తక్కువ ఉన్న వారిలో క్యాన్సర్ పేషెంట్స్ లో కొంత నిమోనియా కలిగించి ప్రమాదం కలగజేయవచ్చు.. వీటికి అన్ని ఆసుపత్రులలో వైద్యం అందించే సదుపాయం కలదు.. కావున భయపడే పనిలేదు.కాకపోతే మనం కొంచెం జాగ్రత్తగా ఉండాలి అంటే మాస్క్ ధరించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం మరియు తుంపరలు వలన ఇన్ఫెక్షన్ మనకు రాకుండా మనుషులు కొంత దూరంగా ఉండటం మంచిది.. ఒకవేళ వచ్చిన భయపడవలసిన పని లేదు మనము సర్ది



లేదా జలుబు మాత్రలు వేసుకుంటే సరిపోతుంది.. సెట్రిజిన్ పారాసెటమాల్ సరిపోతుంది.. రెస్టు తీసుకోవడం బాగా నీరు తాగడం చాలా ఇంపార్టెంట్.. దీనికి ఎటువంటి యాంటీ వైరల్ మందులు కానీ వ్యాక్సిన్ కానీ లేదు.. ఒకవేళ చిన్నపిల్లల లో బ్రాంకైటీస్ లేక నిమోనియా వచ్చి ఆయాసం ఎక్కువగా ఉంటే ఆసుపత్రికి పోతే ఆక్సిజన్ పెడతారు.సపోర్టివ్ ట్రీట్మెంట్ ఇస్తారు.భారత ప్రభుత్వము కర్ణాటక ప్రభుత్వము పైన చెప్పిన అడ్వైజరీ నోట్ ఇచ్చింది.. మన రెండు తెలుగు రాష్ట్రాలలో ఈ వైరస్ ఇప్పటికి 7-1-2025 కు నమోదు కాలేదు...అయినా ఇది కోవిడ్ లాగా మహమ్మారి అయ్యే అవకాశం లేదు ఎందుకంటే దీని ట్రాన్స్మిషన్ చాలా తక్కువ.. కావున అనవసరమైన భయాందోళనకు గురికాకుండా కూల్ గా ఉండండి.

## జనమే మన బలం అనే నినాదంతో 99 టీవీ--మంత్రి ఫరూక్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 07--జనమే మన బలం అనే నినాదంతో 99 టీవీ ప్రజల్లోకి దూసుకెళ్తూ ప్రజల మన్ననలు పొందుతుందని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ 99 టీవీ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99టీవీ జనమే మన బలం అనే నినాదంతో ప్రజల్లోకి దూసుకెళ్తూ ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. నిష్పక్షపాతంగా వార్తలను ప్రచారం చేస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తూ ఎలక్ట్రానిక్ మిాడియా రంగంలో ఒక ప్రత్యేక గుర్తింపు సాధించిన 99టీవీ యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , 99 టీవీ రిపోర్టర్ నిరంజన్ , చాబోలు ఇలియాస్ , టిడిపి నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి , తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి బాబు , వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 07- నంద్యాల సబ్ రిజిస్టర్ అబ్దుల్ సత్తార్ సస్పెండ్ అయ్యారు. ఓ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ డీఐజి దర్యాప్తు జరిపారు. వాస్తవాలు గుర్తించి ఆయనను మంగళవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ ఉన్నంతవరకు హెడ్ క్వార్టర్ వదిలి బయటకు వెళ్ళరాదని ఆదేశించారు. ఆళ్లగడ్డ లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నంద్యాలకు బదిలీ పై వచ్చారు. ఆయనపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## శ్రీమద్రామాయణం భారతీయుల జీవనాడి---

**డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే - -**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 07-శ్రీమద్రామాయణం భారతీయుల జీవనాడి అని, మానవీయ విలువలకు పట్టం కట్టిన శ్రీమద్రామాయణం యావత్ సృష్టి ఉన్నంతవరకు ఆదర్శంగానే నిలుస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, జూపాడుబంగ్లా మండలం, పారుమంచాల గ్రామంలో వెలసిన శ్రీ రామాలయం నందు నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా వారు ప్రారంభోప న్యాసం చేశారు. తదనంతరం తితిదే ధర్మాచార్యులు ఆమంచి వేంకటేశ్వర్లు చేసిన శ్రీమద్రామాయణం మానవీయవిలువలు అనే అంశంపై ప్రవచించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు పాల రాముడు, పి. శివారెడ్డి, పి.లోకేశ్వర రెడ్డి, కె.జనార్ధన రెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు పి.రామచంద్రుడు, పాపయ్యాచారి, సి.చెన్నప్ప ఎస్.వెంకటస్వామి, వి.హరి, నాయుడు, సి.వెంకట రమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190